# గ్రామాభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

**గ్రామీణ అధ్యాయన పరిశోధనా**
**అకాడమి డైరెక్టర్ డాక్టర్ సుందరరామ్**



మాట్లాడుతున్న డాక్టర్ సుందరరామ్

పెదకాకాని : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూపిందిస్తున్న ప్రణాళికా రచనలు గ్రామాల్లోనే జరగాలని సర్పంచ్ షేక్, గ్రామీణ అధ్యాయన పరిశోధనా అకాడమి డైరెక్టర్ డాక్టర్ సుందరరామ్ అన్నారు. భారత పంచాయతీరాజ్ అధికారుల కాలమానం, పని స్థితిగతులపై సోమవారం పంచాయతీ కార్యాలయంలో సమీక్ష జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ ప్రణాళికా రచన, స్థితి గతులు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలను మెరుగు పరచేందుకు భారత గ్రామీణ అధ్యాయనం, పరిశోధనా అకాడమికి బాధ్యతలు అప్పగించింది. దీనిపై అధ్యాయనం చేసేందుకు బాధ్యతలు తీసుకున్న అకాడమి బృందం ఆయా గ్రామాల స్థితిగతులపై రాష్ట్రంలో 8 గ్రామాలను గుర్తించింది. అందులో భాగంగా గుంటూరు జిల్లాలో నంబూరు, దిండి గ్రామాల్లో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భాగంగా సోమవారం నంబూరులో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో పంచాయతీ సంస్థలను మరింత మెరుగు పరచేందుకు చేపట్టవల్సిన అంశాలు, ప్రస్తుతం అమలు చేస్తున్న పనులు సమస్యలు వంటి అంశాలపై చర్చించారు. 29 రాష్ట్రాల్లో జరిగే సర్వేలో భాగంగా అధిక జనాభా ఉండడం, ఢిల్లీలో నంబూరు పంచాయతీ ఉత్తమ పంచాయతీ అవార్డు తీసుకోవడంతో నంబూరు గ్రామాన్ని సర్వే నిర్వహించేందుకు ఎంపిక చేయడం జరిగింది. సమావేశంలో భారత గ్రామీణ అధ్యాయన పరిశోధనా అకాడమి డైరెక్టర్ డాక్టర్ డి సుందరరామ్ మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో జరిగిన సర్వే ఆధారంగా నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. పంచాయతీలకు అవసరమైన ప్రణాళికలు గ్రామాల్లో జరగడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తిస్థాయిలో అధికారుల దృష్టికి వస్తాయన్నారు. ప్రజా సాధికార సర్వే సిబ్బంది చెట్ల కింద కూర్చుని నిర్వహించారని, ఆన్‌లైన్‌లో నమోదు కాని వారు ప్రభుత్వ పథకాల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్వే బృంధం దృష్టికి తెచ్చారు. ఈ సమీక్షా సమావేశానికి పంచాయతీ కార్యదర్శి కె శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నపురెడ్డి రాజశేఖరరెడ్డి, ఎంపీటసీ సభ్యుడు భీమవరపు కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.